క్లుప్తంగా

విప్ 'అడ్లూరి' చిత్రపటానికి క్షీరాభిషేకం



పెగడపల్లి: ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చిత్రపటానికి నందగిరి గ్రామ రైతులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. వరద కెనాల్ తూము ద్వారా చెరువులు నింపారని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి



కోరుట్ల: పట్టణ శివారులోని కేసీఆర్ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ తిరుపతితో కలిసి కేసీఆర్ కాలనీ డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, ఇప్పటివరకు తమకు ఇళ్ల పట్టాలు ఇవ్వలేదని కాలనీవాసులు తెలిపారు. స్పందించిన ఆయన జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన విండో చైర్మన్



పెగడపల్లి: మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన ఫాం హౌస్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితుడు, పెగడపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఓరుగంటి రమణారావు మంగళవారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెగడపల్లి మండలంలో ప్రజా సమస్యలను కేసీఆర్ అడిగి తెలుసుకున్నారని పేర్కొన్నారు.

డ్రోన్ సర్వేకు సహకరించాలి

మెట్‌పల్లి: పట్టణంలో అమృత్ 2.0 పథకంలో భాగంగా వచ్చే నెల 1 నుంచి 10 వరకు డ్రోన్ సర్వే నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు సిబ్బందికి సహకరించాలని కోరారు.

స్వర్ణనంది అవార్డు అందజేత



జగిత్యాలరూరల్: గాయకుడు, తెలంగాణ రత్న అవార్డు గ్రహీత డాక్టర్ గుంటి జగదీశ్వర శర్మ మంగళవారం హైదరాబాద్‌లోని బిర్లా భాస్కర్ ఆడిటోరియంలో కీర్తి ఆర్ట్స్ అకాడమీ స్వర్ణ నంది జాతీయ అవార్డు అందుకున్నారు. ప్రముఖ సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ ఆయనకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా జగిత్యాలకు చెందిన జగదీశ్వర శర్మను పలువురు అభినందించారు.

విద్యార్థికి సన్మానం



జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్‌లోని మౌంట్ కార్మెల్ స్కూల్ విద్యార్థి మణిదీప్ ఈ నెల 21 నుంచి 25 వరకు పుదుచ్చేరిలో జరిగిన జాతీయ స్థాయి సైన్స్‌ఫేర్‌లో రెండోస్థానం సాధించాడు. మంగళవారం రాత్రి అతన్ని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సన్మానించారు. జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్, పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జ్యోతిష్‌మరియ, గైడ్ టీచర్ కవిత పాల్గొన్నారు.

అలరించిన ఫేర్‌వెల్ డే



కోరుట్ల: పట్టణంలోని రామకృష్ణ జూనియర్ కళాశాలలో మంగళవారం ఫేర్‌వెల్ డే నిర్వహించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వక్తలు సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజు, డైరెక్టర్ హరిప్రియ, అధ్యాపకులున్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయించాలి

కథలాపూర్: కోరుట్ల–వేములవాడ డబుల్ రోడ్డు కథలాపూర్ మండలంలో అధ్వానంగా ఉందని, మరమ్మతు చేయించాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు కోరారు. మంగళవారం తహసీల్దార్ వినోద్‌కు వినతిపత్రం అందించారు. హరీశ్, రమేశ్, గంగరాజం తదితరులున్నారు.

విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

- డీఈవో రాము
- మల్యాల మండల పదోతరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు



తుంగూర్ స్కూల్లో మాట్లాడుతున్న ట్రైనర్ రమేశ్



మల్యాలలో సదస్సుకు హాజరైన డీఈవో రాము, ఉపాధ్యాయులు

మల్యాల: విద్యార్థులు ప్రణాళికతో చదవాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేయాలని డీఈవో కె.రాము అన్నారు. మల్యాల మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్లో మంగళవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు విషయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈవో జయసింహారావు జ్యోతిప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా డీఈవో మాట్లాడుతూ.. చదువులో వెనకబడిన పదోతరగతి విద్యార్థులను గుర్తించాలని, వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని మోటివేషనల్ స్పీకర్ రామస్వామి అన్నారు. సబ్జెక్టులవారీగా సందేహాలను నివృత్తి చేసుకోవాలని చెప్పారు. ట్రస్మా మండల అధ్యక్షుడు పోకల నరేశ్, ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదవాలి

రాయికల్: విద్యార్థులు ఏకాగ్రతతో చదివినప్పుడే లక్ష్యాన్ని సాధిస్తారని మోటివేషన్ స్పీకర్ డాక్టర్ నరేశ్ అన్నారు. మంగళవారం రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బంగారు తల్లి ప్రేరణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పదోతరగతి విద్యార్థులు సమయం వృథా చేయకుండా చదవాలని సూచించారు. చేతిరాత బాగుంటేనే అధిక మార్కులు వస్తాయని చెప్పారు. ఎంఈవో రాఘవులు, టీచర్లు పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు

సారంగాపూర్: ఏకాగ్రత, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సామాజిక సేవకుడు, ఇంపాక్ట్ ట్రైనర్ రేణికుంట రమేశ్ అన్నారు. మంగళవారం బీర్‌పూర్ మండలం తుంగూర్ హైస్కూల్లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సమాజంలో గొప్ప గొప్ప విజయాలు సాధించినవారు పేద కుటుంబాల నుంచి వచ్చినవారేనని తెలిపారు. చదువుకు పేదరికం అడ్డుకాదన్న విషయాన్ని గుర్తించాలని సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం చీకటిమయం అవుతుందన్నారు. శ్రీకృష్ణ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ ఓగుల అజయ్ పాఠశాలకు టెంట్ అందిస్తానని హామీ ఇచ్చారు. హెచ్ఎం భాస్కర్‌రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.



కోరుట్ల రూరల్: మేజర్ గ్రామ పంచాయతీ అయిలాపూర్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల మధ్య డ్రైనేజీలు కంపు కొడుతున్నాయి. చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. మురికి నీరు ఎక్కడికక్కడ నిలుస్తుండటంతో దుర్గంధం వస్తోంది. చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
కృపాకర్, మండల పంచాయతీ అధికారి, కోరుట్ల, సెల్ నంబర్: 9676949987

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

పాత పెన్షన్ విధానమే కావాలి



రంగపేట స్కూల్లో నిరసన తెలుపుతున్న నాయకులు

జగిత్యాల: సీపీఎస్ వద్దని పాత పెన్షన్ విధానమే కావాలని సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు మహేశ్ అన్నారు. మంగళవారం సారంగాపూర్ మండలం రంగపేట హైస్కూల్లో టీచర్లతో కలిసి నిరసన తెలిపారు. తాము దశాబ్ద కాలంగా పోరాటం చేస్తుంటే కేంద్ర ఆర్థిక శాఖ కార్పొరేట్ శక్తులకు తలొగ్గి, సీపీఎస్‌ను తీసుకువస్తోందన్నారు. నాయకులు జనార్దన్, శ్రీనివాస్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: బొమ్మెన, తాండ్ర్యాల, తక్కళ్లపెల్లి ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం మధ్యాహ్న భోజనం విరామ సమయంలో టీచర్లు నిరసన తెలిపారు. కేంద్రం యూపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత పింఛన్ విధానం అమలు చేస్తేనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు మేలు జరుగుతుందన్నారు. నాయకులు సాయిరెడ్డి, శివకృష్ణ, రమేశ్, రవి, శంకర్, నాయక్ తదితరులున్నారు.

ధర్మపురి: యూపీఎస్ వద్దు.. పాత పెన్షన్ విధానమే ముద్దని రాజారం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు. తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం యూపీఎస్ ప్రతులను దహనం చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి బండారి సతీశ్ మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్ పునరుద్ధరించాలని కోరారు. నాయకులు పవన్‌కుమార్, రాజేశ్, కృష్ణ, శ్వేతారాణి, స్వప్న, రేణుక, మమత తదితరులున్నారు.

ఫిట్‌మెంట్‌తో కూడిన పీఆర్సీ ప్రకటించండి



సభ్యత్వం ఇస్తున్న స్వామియాదవ్

కోరుట్ల రూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు 60 శాతం ఫిట్‌మెంట్‌తో కూడిన పీఆర్సీ ప్రకటించాలని ఆర్‌యూపీపీటీ రాష్ట్ర సహాధ్యక్షుడు వేల్పుల స్వామి యాదవ్ డిమాండ్ చేశారు. మోహన్‌రావుపేట ఉన్నత పాఠశాలలో మంగళవారం సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆదాయ పన్ను పరిమితి రూ.15 లక్షలకు పెంచాలని, పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. 24 ఏళ్ల సర్వీస్ పూర్తయిన టీచర్లకు గెజిటెడ్ హోదా కల్పించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కటుకం నరేందర్, గౌరవ అధ్యక్షుడు సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు సంపతి నారాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురి రైతు కూలీలకు రూ.12 వేలివ్వాలి



ధర్మపురి: పట్టణంలోని రైతు కూలీలకు కూడా ప్రభుత్వం అందించే రూ.12 వేలివ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వివిధ శాఖల అధికారులకు వినతిపత్రాలు అందించారు. ఉపాధిహామీ పథకంలో ఏడాదికి 20 రోజులు పని చేసిన వారిని అర్హులుగా గుర్తిస్తున్నారని అన్నారు. ధర్మపురిని మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మార్చడంతో స్థానికులకు ఉపాధిహామీ వర్తించక నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, వీరికి కూడా న్యాయం చేయాలని కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, నాయకులు లక్ష్మణ్, శ్రీనివాస్, వైకుంఠం, లవణ్‌కుమార్ తదితరులున్నారు.

సెల్ టవర్ ఏర్పాటుపై విచారణ

మల్యాల: మండల కేంద్రంలో ఇళ్ల మధ్య సెల్ ఫోన్ టవర్ ఏర్పాటు చేయడాన్ని స్థానికులు వ్యతిరేకించడంతో స్థానిక బ్లాక్ చౌరస్తాలో ట్రాయ్ అధికారులు మంగళవారం బహిరంగ విచారణ చేపట్టారు. టవర్ ఏర్పాటు చేస్తే రేడియేషన్‌తో కేన్సర్ వంటి వాధ్యులు వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు మాట్లాడుతూ.. టవర్‌తో ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని, ఆరోగ్యంపై రేడియేషన్ ప్రభావం ఉండదని తెలిపారు. అయినా, వారు ఒప్పుకోకపోవడంతో వెనుదిరిగారు. ఎంపీడీవో స్వాతి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి సర్వే

జగిత్యాలరూరల్: నర్సింగాపూర్ శివారులోని సర్వే నంబర్ 437లో గల ప్రభుత్వ భూమిని మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్వే చేశారు. ఇటీవల ఈ భూమిని కొందరు కబ్జా చేసి, అక్రమంగా పట్టాలు పొందిన విషయమై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఫిర్యాదు చేయడంతో సర్వే చేపట్టి, హద్దులు నిర్ణయించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి 'బండి' క్షమాపణ చెప్పాలి



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కొండగట్టు: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, ప్రజా యుద్ధ నౌక గద్దర్‌లపై చేసిన వ్యాఖ్యలను కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ వెనక్కి తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ కొడిమ్యాల మండల అధ్యక్షుడు అజయ్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం నిరసన తెలిపారు. కేంద్ర మంత్రి సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కేంద్రమంత్రి తన తప్పును తెలుసుకొని, క్షమాపణ చెప్పాలని, గద్దర్‌కు పద్మశ్రీ అవార్డు వెంటనే ప్రకటించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరి నారాయణ, ఉపాధ్యక్షుడు లింగాల అజయ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చంద్రమోహన్ రెడ్డి, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు తాళ్లపెల్లి విక్రమ్‌గౌడ్‌నాయకులు అంతడ్పుల జలంధర్, జితేందర్ రెడ్డి, చిలువేరి నరేశ్, కల్యాణ్, సాయి, సతీశ్, రాఘవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'గద్దర్‌కు ఎందుకివ్వాలనడం సరికాదు'

కోరుట్ల: ప్రజా గాయకుడు గద్దర్ గురించి మాట్లాడే అర్హత మనువాదులకు లేదని అంబేడ్కర్ సంఘం నాయకులు వనతడుపుల అంజయ్య, బలిజ రాజారెడ్డి అన్నారు. మంగళవారం కోరుట్లలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారు మాట్లాడారు. గద్దర్‌కు పద్మశ్రీ అవార్డు ఎందుకివ్వాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అనడం సరికాదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎవరికి అవార్డులు ఇస్తుందో తెలుసని ఎద్దేవా చేశారు. రెచ్చగొట్టే మాటలు మాట్లాడితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. నాయకులు ఉయ్యాల శోభన్, ప్రవీణ్, గంగాధర్, లక్ష్మణ్, సంతోష్‌కుమార్, సత్తయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

హిందువులను కించపరిచేలా ఖర్గే వ్యాఖ్యలు



మాట్లాడుతున్న సత్యం, రమణ, పక్కన నాయకులు

జగిత్యాలరూరల్: హిందుత్వాన్ని విమర్శించడం కాంగ్రెస్‌కు ఫ్యాషన్ అయిపోయిందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధులు మద్రిపల్లి సత్యం, భూమి రమణ అన్నారు. మంగళవారం నర్సింగాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో జరుగుతున్న మహా కుంభమేళాలో స్నానమాచరించిన ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌లు నరకానికి పోతారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే చేసిన వ్యాఖ్యలు హిందువులను కించపరిచేలా ఉన్నాయని తెలిపారు. వాటిని వెనక్కి తీసుకొని, హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి గంగారాం, కోశాధికారి దశరథరెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు తిరుపతి, వాణిజ్య సెల్ జిల్లా కన్వీనర్ గణేశ్ పాల్గొన్నారు.

'బహుజనులను వేధిస్తే సహించం'



మాట్లాడుతున్న రాజారాం యాదవ్

మల్లాపూర్: బహుజనులను అక్రమ కేసులతో వేధిస్తే సహించమని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాంయాదవ్ అన్నారు. మంగళవారం మల్లాపూర్ మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని బహుజనులు గ్రామసభల్లో ప్రశ్నిస్తే కాంగ్రెస్ నాయకుడు ఎల్లాల జలపతిరెడ్డి అగ్రకుల అహంకారంతో పోలీసులపై ఒత్తిడి తెచ్చి, అట్రాసిటీ కేసు పెట్టించారని మండిపడ్డారు. కేసు వెనక్కి తీసుకోకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొల్లపెల్లి రామాగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారాంయాదవ్ అన్నారు. మంగళవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ కల్యాణ మండపంలో మహాసభ నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. మహాసభ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి లక్కం మల్లేశ్‌యాదవ్, మండల అధ్యక్షుడు సంగ గంగరాజం యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు అన్ని కులాలూ సమానమే



మాట్లాడుతున్న సురేశ్, పక్కన నాయకులు

మల్లాపూర్: దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన కాంగ్రెస్ పార్టీకి అన్ని కులాలూ సమానమేనని కాంగ్రెస్ బీసీ సెల్ మల్లాపూర్ మండల అధ్యక్షుడు వర్ద సురేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామసభలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఫ్లెక్సీని అధికారులు, పోలీసుల సమక్షంలోనే చించివేసినవారిని అంతడుపుల నర్సయ్య అడ్డుకున్నారని తెలిపారు. ఆయనను దూషించడం వల్లే అట్రాసిటీ కేసు పెట్టారన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్‌కు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎల్లాల జలపతిరెడ్డికి ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, బహుజన నాయకులు రాజేందర్, ఆనంద్‌గౌడ్, మల్లయ్య, సోమయ్య, రాజరెడ్డి, లక్ష్మణ్ తదితరులున్నారు.

'ఆత్మీయ భరోసా' జాబితా పరిశీలన

మల్యాల: సర్వాపూర్‌లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించిన లబ్ధిదారుల జాబితాను డీఆర్‌డీవో పీడీ రఘువరన్ మంగళవారం పరిశీలించారు. మండల కేంద్రంలో నర్సరీని తనిఖీ చేశారు. మానాల గ్రామంలో ఈజీఎస్ నిధులతో ఏర్పాటు చేసిన పశువుల పాక పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వాతి, ఈసీ మనోజ్, టీఏ లావణ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

జగిత్యాలరూరల్: ఈ నెల 30న జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ సీనియర్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పసనగొట్టు మనోహర్, కార్యదర్శి చెన్ను వెంకటేశ్ తెలిపారు. రాయికల్ మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో సీనియర్ పురుషులు, మహిళల జట్లకు పోటీలు జరుగుతాయన్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఉదయం 10 గంటలకు పాఠశాలలో హాజరు కావాలని, వివరాలకు పీఈటీ తుకారంను 80084 74654 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

2న మెట్‌పల్లిలో బౌద్ధ మహాసభ

మెట్‌పల్లి: పట్టణంలో వచ్చే నెల 2న బౌద్ధ మహాసభ నిర్వహిస్తున్నట్లు బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సభ్యులు తెలిపారు. స్థానిక అంబేడ్కర్ పార్కులో మంగళవారం సంబంధిత కరపత్రాలు ఆవిష్కరించారు. సభకు పలువురు బౌద్ధ గురువులు హాజరవుతారని పేర్కొన్నారు. నరేందర్, రఘు, సురేందర్, సాగర్, అశోక్ తదితరులున్నారు.

ఇంటిపన్ను వసూళ్లు పూర్తవ్వాలి

సారంగాపూర్: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటిపన్ను వసూళ్లు వందశాతం పూర్తవ్వాలని ఎంపీడీవో గంగాధర్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామ పంచాయతీలు ట్రాక్టర్ల వాయిదాలను గడువులోగా చెల్లించాలని సూచించారు. పని చేయని చేతిపంపులను గుర్తించి, మరమ్మతు చేయించాలన్నారు. గ్రామసభల్లో మళ్లీ వచ్చిన దరఖాస్తులు, నర్సరీలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీవో మహమ్మద్ సలీం, ఈజీఎస్ ఏపీవో శ్రీలత పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

రాయికల్: తాట్లవాయి గ్రామంలో శ్రీరామ స్పోర్ట్స్ యూత్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ప్రారంభమైంది. స్పాన్సర్ ధర్మాజీపేటకు చెందిన మ్యాకల రమేశ్, ఆర్గనైజర్లు శ్రీకర్, తిరుపతి, హృదయ్ తదితరులు పాల్గొన్నారు.

కుల బహిష్కరణ చేసిన ఐదుగురిపై కేసు

జగిత్యాలక్రైం: కుల బహిష్కరణ చేసిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ మంగళవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం బాలపల్లిలో సంక్రాంతి సందర్భంగా బీరయ్య పండుగ జరిపారు. అప్పుడు దొందరి గంగారాంతోపా టు మరో నాలుగు కుటుంబాలకు మాంసం పంపకుండా కుల బహిష్కరణ చేశారు. బాధితుల ఫిర్యా దు మేరకు గుంటి రవి, మహేశ్, నడిపయ్య, చిన్న న్న, రాహుల్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అత్తింటివారిపై వరకట్న వేధింపుల కేసు

కథలాపూర్: ఓ వివాహితను అదనపు వరకట్నం కోసం వేధించిన ఆమె అత్తింటివారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కథలాపూర్ మండలం పోతారం గ్రామానికి చెందిన రమకు మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌కు చెందిన బీనవేని అరుణ్‌తో ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక బాబు ఉన్నాడు. ఇటీవల అదనంగా రూ.10 లక్షలు కట్నం తేవాలని భర్త అరుణ్, అత్త మీనమ్మ, బావ హరీశ్, తోటి కోడలు రాజ్యలక్ష్మి రమను వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో బాధితురాలు మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై..

కథలాపూర్: రోడ్డు ప్రమాదానికి కారణమైన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రానికి చెందిన విజయ్ బైక్‌పై వస్తున్నాడు. కథలాపూర్ మండలం తాండ్ర్యాల ఎక్స్‌రోడ్డు వద్ద ముందు వెళ్తున్న తాండ్ర్యాలకే చెందిన టాటాఏస్ వాహన డ్రైవర్ ఎండీ.వసీం అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో బైక్ టాటాఏస్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయ్ చేయి విరిగింది. బాధితుడి ఫిర్యాదుతో వసీంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కొండాపూర్–ఒడ్యాడ్ రోడ్డు, బ్రిడ్జిలకు నిధులు

మేడిపల్లి: కొండాపూర్ నుంచి ఒడ్యాడ్ బీటీ రోడ్డు, బ్రిడ్జిలకు రూ.7 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ రోడ్డు 11.41 కిలోమీటర్లు ఉంటుంది. పదేళ్లుగా గుంతల దారిపై ప్రయాణిస్తూ ఇబ్బంది పడుతున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లడంతో నిధుల మంజూరుకు చర్యలు తీసుకున్నారని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లతో కార్పొరేట్ ఉద్యోగాలు

జగిత్యాల: కళాశాలల్లో క్యాంపస్ డ్రైవ్‌లతో గ్రామీణ విద్యార్థులు సైతం కార్పొరేట్ ఉద్యోగాలు సాధిస్తున్నారని రామకృష్ణ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రామకృష్ణ అన్నారు. మంగళవారం టెక్ మహీంద్ర, న్యూకనెక్ట్, క్వెస్ సంస్థలు తమ కాలేజీలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించాయని తెలిపారు. మొత్తం 500 మంది విద్యార్థులు హాజరవగా, 225 మంది ఎంపికయ్యారని పేర్కొన్నారు.

మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ హర్షణీయం

మల్లాపూర్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడం హర్షణీయమని సమితి రాష్ట్ర నాయకుడు మాట్ల బుచ్చయ్య అన్నారు. మంగళవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ నూతిపెల్లి రాజం, నాయకులు పాల్గొన్నారు.

బస్టాప్, రేషన్‌షాపు ఏర్పాటు చేయాలి

సారంగాపూర్: నాయికపుగూడెం గ్రామంలో బస్టాప్, రేషన్‌షాపు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. మంగళవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి, విన్నవించారు. గ్రామంలో ఆర్టీసీ బస్సులను ఆపకపోవడంతో తాము ప్రైవేటు వాహనాల్లో వెళ్లాల్సి వస్తోందని, గ్రామ పంచాయతీ ఏర్పాటై, ఆరేళ్లయినా రేషన్‌షాపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్సీ ఉన్నతాధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

ఉచిత వైద్య శిబిరాలు

సారంగాపూర్: రేచపల్లిలో కరీంనగర్ ప్రతిమ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మొత్తం 270 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. శస్త్రచికిత్స చేయాల్సిన వారిని గుర్తించి, తమ ఆస్పత్రికి రావాలని సూచించారు. నాయకులు మనోహర్ రెడ్డి, మహేశ్, తిరుపతిరెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

ధర్మపురి: కోస్నూర్‌పల్లెలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 120 పశువులకు చూడి, కట్టు నిలవక పోవడం, గర్భకోశ సంబంధిత వ్యాధుల పరీక్షలు చేసి, మందులు అందించారు. రైతులకు సబ్సిడీ పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ ఎన్నం లక్ష్మారెడ్డి, వివిధ మండలాల పశు వైద్యాధికారులు వేణుగోపాల్, సునిల్, తిరుపతిగౌడ్, సిబ్బంది ఉన్నారు.

నేడు ఇసుక వేలం

మల్లాపూర్: స్వాధీనం చేసుకున్న 7 ట్రిప్పుల ఇసుకకు బుధవారం వేలంపాట నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వీర్ సింగ్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 11 గంటలకు హాజరు కావాలన్నారు. గోదావరి, పెద్దవాగు తీర ప్రాంతాల నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.